

అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం..

- మంత్రి సవిత



ఏఆర్ కొట్టాల పెద్దవంక దగ్గర పరిశీలిస్తున్న మంత్రి సవిత

రొద్దం, జూలై 20(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని నల్లూరు, పెన్నానది బ్రిడ్జి, పెద్దగువ్వలపల్లి రోడ్డు, ఏఆర్ కొట్టాల పెద్దవంక బ్రిడ్జి పనులను మంత్రి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. పి. రొప్పాలలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. నల్లూరులో పెన్నానది కాజ్‌వే పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో దివ్యాంగులు, అనారోగ్య బాధితులను పరామర్శించారు. దందేపల్లికి చెందిన మహిళా రైతు గోవిందమ్మ సాగుచేసిన పత్తి పంటను పరిశీలించారు. పెట్టుబడి, దిగుబడి వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. దిగుబడి బాగా వచ్చిందని మహిళా రైతు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటరమణ, ఎంపీడీఓ రాంకుమార్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్ప, వెంకటరామిరెడ్డి, ఐటీడీడీపీ పవన్ పాల్గొన్నారు.

సత్యసాయి బోధనలే జీవిత పాఠాలు

- మలేషియా ప్రతినిధి విమల్‌రాజ్

పుట్టపర్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బోధనలను జీవిత పాఠాలుగా భావించి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని శ్రీసత్యసాయి సేవాసంస్థల మలేషియా ప్రతినిధి విమల్‌రాజ్ సెల్వరాజ్ పేర్కొన్నారు. స్థానిక సాయికుల్వంత్ సభామండపంలో యువత నాయకత్వంపై సదస్సు మూడోరోజు ఆదివారం కొనసాగింది. మలేషియా ప్రతినిధి ప్రసంగిస్తూ నిస్వార్థ సేవలే పరమావధిగా యువత జీవితాన్ని కొనసాగించాలన్నారు. సత్యసాయి బోధనలు, సేవలను, జీవిత పరమార్థంగా భావించి దేశసేవలో కొనసాగాలన్నారు. విలువలతో కూడిన జీవితాన్ని సాగించడం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందగలరని పేర్కొన్నారు. అనంతరం యూకే ప్రతినిధి రిసాద్ లాకియా, జోన్-9 చైర్మన్ సుబ్రీనాయుడు నాయకత్వలక్షణాల గురించి ప్రసంగించారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్.. యువతకు సర్టిఫికెట్లను అందజేసి, అభినందించారు. అనంతరం భక్తులు 'యువలయం తవనిలయం' పేరిట కచేరి నిర్వహించారు. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపైభక్తిగీతాలు ఆలపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న చక్రవర్తి, పాటలు పాడుతున్న భక్తులు

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్, జూలై20(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

నవ వరుడు ఆత్మహత్య

5

స్వాతంత్ర్య పోరాటతత్వాన్ని భవిష్యత్తు తరాలకు ఇవ్వడం

హర్షణీయం

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాల్ గౌడ్
- భారతీయ ముస్లిం లెజెండ్ పుస్తకావిష్కరణ

5



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ గోపాల్ గౌడ్, గజల్ శ్రీనివాస్ తదితరులు

ఊరి బడి ఉసూరు..!

- ప్రైమరీ స్కూళ్లకు గడ్డుకాలం
- వెంటాడుతున్న వైసీపీ ప్రభుత్వ విధానాలు

సంస్కరణలతో కష్టాలు

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు భవిష్యత్తులో మనగలుగుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఉపాధ్యాయులకు సైతం బోధనేతర పనులు పెడుతున్నారు. దీంతో నాణ్యమైన విద్య అందించలేకపోతున్నారు. పలు నివేదికలను అధికారులు అడుగుతున్నారు. విద్యార్థులకు నాలుగు అక్షరాలు చెప్పారా, లేదా.. అని పర్యవేక్షించే వారి కంటే.. నివేదికలు ఎందుకు పంపలేదని అడిగేవారే ఎక్కువయ్యారు.

-కోనంకి చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్టీయూ



జిల్లాలో 222 ఏకోపాధ్యాయ పాఠశాలలు

ప్రశ్నార్థకంగా మనుగడ

ఊరంతా నిశ్శబ్దంగా ఉన్నా..
బడి వద్దకెళ్తే మాత్రం..
గోలగోలగా ఉండేది..
పిల్లల అల్లరితో
ఆ ప్రాంతమంతా
సందడిగా ఉండేది..
బడి గంట కొడుతుండగానే
పిల్లలు పరుగున వెళ్లేవారు..
ఇంటర్వెల్ వదిలితే..
గుంపులుగా కనిపించేవారు..
పాఠశాల వదలగానే..
కేరింతలు కొడుతూ వెళ్లేవారు..
అలాంటి బడి..
పిల్లలు లేక ఉసూరుమంటోంది..
అది పాఠశాలేనా..
అన్న అనుమానం
తలెత్తుతోంది..



కొత్తచెరువు మండలం మైలేపల్లిలోని ఏకోపాధ్యాయ పాఠశాల



కొత్తచెరువు, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినపుడల్లా విద్యారంగంలో సంస్కరణలు అమలు చేయడం సర్వసాధారణంగా మారింది. 2020లో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చింది. అమలుకు పలు రాష్ట్రాలు వెనకడుగు వేశాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తూనే ప్రపంచ బ్యాంకు నుంచి రూ.1,876 కోట్లను అప్పుగా తెచ్చుకుంది. ఈ మేరకు గత ప్రభుత్వం స్టాల్ పథకాన్ని తీసుకొచ్చి జీఓ నంబర్ 117 అమలు చేసింది. ఈ విద్యావిధానంతో అంతర్జాతీయ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రచారం చేసుకుంది. 117 జీఓతో ఏ ఒక్క బడిని మూసివేయబోమనీ, ఒక్క ఉపాధ్యాయుడినీ తగ్గించబోమని నాటి సీఎం జగన్ పలు సభల్లో చెప్పుకొచ్చారు. ఈ జీఓ వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు మూతపడే అవకాశం ఉందంటూ ఉపాధ్యాయ సంఘాలు, మేధావులు పెద్దఎత్తున పోరాటాలు చేశారు. ఇది తమ ప్రభుత్వ పాలసీ అని మొండిగా ముందుకెళ్లారు. దీంతో 3, 4, 5 తరగతుల విద్యార్థులను సబ్జెక్టు బోధన పేరుతో హైస్కూళ్లలో కలిపేశారు. ఈ కారణంగా గ్రామాల్లోని పాఠశాలలు 1, 2 తరగతులకే పరిమితమయ్యాయి. దీంతో కొంతమంది హైస్కూళ్లకు వెళ్లగా.. మరికొందరు ప్రైవేటు పాఠశాలల బాటపట్టారు. ఈ విధానం వల్ల గ్రామీణ ప్రాథమిక పాఠశాలలు మూతపడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి

(మిగతా 5లో..)

ఓహో..అందుకా..!

పార్టీ నుంచి గెంటేసినా నేతల ఆరాటం

కార్యక్రమాలు చేసింది.. ఇన్‌చార్జి సీటు కోసమేనా?

పురం వైసీపీలో తీవ్ర చర్చలు



హిందూపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలో లేదు. స్థానికంగా వారనుకున్నంత బలమూలేదు. గతంలో ఎప్పుడైనా నియోజకవర్గంలో గెలిచారా అంటే.. అదీలేదు. అయినా ఆ పదవికోసం ఆ పార్టీ నేతలు పడుతున్న ఆరాటం ఆశ్చర్యం కలిగిస్తోంది. పార్టీ గెంటేసినా ఇంకా అంటిపెట్టుకుని ఉంటామంటున్న నేతలపై సొంతపార్టీవారే చీదరించుకుంటున్నారు. హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ ఆవిర్భావం నుంచి ఇక్కడ పార్టీకి ఎదురులేదు. మరో పార్టీ అభ్యర్థి గెలుపొందిన దాఖలాలులేవు. 11సార్లు సైకిల్ సవారీ చేసింది. భవిష్యత్తులో మరో పార్టీ గెలుస్తుందన్న నమ్మకం కూడా లేదు. ఎందుకంటే టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు ఆ పార్టీకి వేసిన బీజం అలాంటిది. ఇక్కడ వైసీపీలో మాత్రం ఇన్‌చార్జి పదవికోసం పట్టుబడుతున్నారు. దీంతో ప్రస్తుత సమన్వయకర్తగా ఉన్న దీపిక ఆ పార్టీలోని ఓ ముఖ్య రాష్ట్రస్థాయి నేత ద్వారా హిందూపురానికి చెందిన ఇద్దరు ముఖ్య నేతలను సస్పెండ్ చేయించగలిగారన్న వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం వారు పార్టీలో ఉంటూ కొంతకాలంగా కార్యక్రమాలు చేస్తుండడమే. ఈ పరిస్థితుల్లో తమను ఎక్కడ అధిగమిస్తారోనన్న ఉద్దేశంతోనే ఆ ఇరువురిని చెక్ పెట్టగలిగారన్న వాదనలు రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి.

పార్టీ నుంచి గెంటేసినా..

హిందూపురం రాజకీయాల్లో దశాబ్దాలుగా ఉన్న ఇద్దరు నేతలను వైసీపీ సస్పెండ్ చేసింది. సాధారణంగా ఏదైనా తప్పు చేసినపుడు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారు. అలాంటివారు కూడా పార్టీపై చిర్రుబుర్రులాడతారు. హిందూపురంలో వైసీపీ నుంచి సస్పెండ్ అయిన నేతల తీరు విభిన్నం. ఎందుకంటే ఇప్పటికీ పార్టీతోనే ఉంటామని విలేకరుల సమావేశంలో చెప్పడం గమనార్హం. పార్టీ కార్యకర్తలు, నాయకులకు కష్టం వస్తే తాముంటామని ప్రకటించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పడం గమనార్హం. పార్టీ అధిష్ఠానం ఆలోచించాలనీ, రాజకీయ కుట్రలో భాగమనీ, 2029లో ఆ పార్టీ తరపున బరిలో ఉంటామని చెప్పడం మరో విశేషం. దీనిని బట్టి వారంతా పోరాటం చేస్తున్నది ఇన్‌చార్జి పదవికేనని అర్థం అవుతుంది. ఎందుకంటే హిందూపురంలో ఆ పార్టీ అభ్యర్థులు గెలవడం మహాకష్టం. అలాంటపుడు వారు ఆశించేది ఆ పార్టీ ఇన్‌చార్జి పదవే కాబట్టి దీనికోసం ఎందుకంత తాపత్రం అంటూ రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

అందుకేనా..?

ప్రస్తుత సమన్వయకర్త దీపిక బెంగళూరుకే పరిమితం అవుతున్నారని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. దీంతో స్థానికంగా ఉన్న నేతలు చురుగ్గా పాల్గొంటే వారికి ఇన్‌చార్జి పదవి వస్తుందన్న ఆశతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇటీవల వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఇరువురు ముఖ్యనేతలు చేసిన కార్యక్రమానికి లక్షల్లో ఖర్చుచేశారు. సమన్వయకర్తగా ఉన్న దీపిక కంటే ఎక్కువగా ఆ ఇరువురు నాయకులే ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. ఈ పరిస్థితుల్లో అంత పెద్దఎత్తున కార్యక్రమాలు చేయడం వెనుక ఇన్‌చార్జి పదవికేనని వైసీపీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు. అందుకే పోటీపడి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొంటున్నారు. సస్పెండ్ చేసినా పార్టీతోనే ఉంటానని నేతలు అంటున్నది అందుకోసమేనంటూ సొంత పార్టీ నాయకులు అంటున్నారు.



ప్రజలే.. వైసీపీని రప్పా రప్పా ఆడించారు..

- ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేస్తున్నాం: ఎంపీ బీకే
- పనులు చేసి ప్రతి ఇంటికీ ధైర్యంగా వెళ్తున్నాం: ఎమ్మెల్యే సునీత

5

తెగులు.. దిగులు..!

టమోటా పంటకు మచ్చ

తుడిచిపెట్టుకుపోతున్న తోటలు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు



మచ్చ తెగులు సోకడంతో తొలగించిన టమోటా కాయలు

5

చుక్కలు చూపిస్తున్నారు..!

ముడుపులిస్తేనే ఎన్ఓసీలు

ఫైల్‌ను బట్టి రూ.5లక్షల నుంచి రూ.50 లక్షల వరకు..

తహసీల్దార్ వయా ఆర్డీఓ ద్వారా కలెక్టరేట్ వరకు ఇదే పరిస్థితి

5వేలకుపైగా పెండింగ్‌లో చుక్కల భూములు

22ఏ ఫైళ్లలోనూ అదే దుస్థితి.. మధ్యవర్తుల ద్వారా వ్యవహారం

అనంతపురం కలెక్టరేట్, జూలై 20(ఆంధ్రజ్యోతి): నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్ఓసీ) కావాలంటే ఆషామాషీ కాదు. ప్రభుత్వ అధికారులతో పూర్తయ్యే ఈ ఎన్ఓసీ ప్రక్రియకు మధ్యవర్తులు వ్యవహారం నడుపుతున్నారంటే.. బేరసారాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చుక్కల భూమి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ప్రజలు, రైతులు కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రధానంగా చుక్కల భూములు, 22ఏ పరిధిలోని భూములకు సంబంధించిన ఫైల్స్ ఎన్ఓసీ కోసం వెళ్తాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం ద్వారా చేరాలి. అక్కడ ఫైనల్ సంతకం పూర్తయితే ఆ భూమికి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశముంటుంది. ఈ తతంగం అంత సులభంగా జరగడం లేదు. ఒక్కో కార్యాలయంలో నాలుగు నుంచి ఆరునెలలకు పైగా మూలుగుతున్నాయనే విమర్శలున్నాయి. వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యే ఫైల్స్ తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి రావడానికి రెండేళ్లు పడుతోంది. ఇక ఆ ఫైళ్లు వేగంగా కదిలి ఎన్ఓసీ చేతికి రావాలంటే ముడుపులు ముట్టజెప్పాలి. దీంతో సామాన్యులు డబ్బులు చెల్లించుకోలేక, కార్యాలయాల చుట్టూ తిరగలేక అలాగే వదిలేసుకుంటున్నారు.



అనంతపురం కలెక్టరేట్

వేల సంఖ్యలో పెండింగ్,...

కూడేరు మండలం కమ్మూరుకు చెందిన ఓ రైతు 16ఎకరాలకు సంబంధించి ఎన్ఓసీ కోసం ప్రయత్నిస్తున్నాడు. 22ఏ కింద ఉన్న ఆ భూమి కోసం 2018 నుంచి విఫలయత్నం చేస్తున్నాడు. సబ్ డివిజన్ మ్యాప్ పెట్టి పంపమని కలెక్టరేట్ నుంచి పంపారు. కానీ ఇంతవరకూ ఆ ఫైల్ ఎక్కడుందో తెలియడం లేదట. ఆ ఫైల్ కోసం ఆ రైతు తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. ఇలాంటి ఫైల్స్ వేల సంఖ్యలో ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 32 మండలాలున్నాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లాల్సిన సంబంధిత ఫైల్స్ ఎక్కడికక్కడే పెండింగ్‌లో ఉంటున్నాయి. ఆర్డీఓ కార్యాలయాల్లో పరిశీలించాక కలెక్టరేట్‌కు పంపాలి. ఇలాంటి వాటిలో 22ఏ ఫైళ్లు వందల సంఖ్యలో, చుక్కల భూములు వేల సంఖ్యలో ఆర్డీఓ కార్యాలయాల్లో ఉంటున్నాయి. అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో 22ఏ ఫైళ్లు 161, చుక్కల భూములు 3వేలకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. కళ్యాణదుర్గంలో ఆర్డీఓ కార్యాలయంలో 130వరకు 22ఏ ఫైళ్లు, 1020 వరకు చుక్కల భూముల ఫైళ్ల పరిస్థితి అలాగే ఉంది. గుంతకల్లు డివిజన్‌లో 80కు పైగా 22ఏ ఫైల్స్, 800 వరకు చుక్కల భూములు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక తహసీల్దార్ కార్యాలయాల గురించి చెప్పుకోవడం దండగ.

రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు....

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్ఓసీ పూర్తయిన ఫైల్స్ 30లోపే ఉంటాయని రెవెన్యూ శాఖ వర్గాల సమాచారం. 'చుక్కల భూములు, 22 ఫైల్స్ ముందుకు కదలాలంటే మీకు రెకమెండేషన్ చేయాలి.. లేదా మిమ్మల్ని సంతృప్తి పరచాలా...?' అని స్వయంగా

(మిగతా 5లో...)

సమ్మోహనం..

పుట్టపర్తి శిల్పారామంలో భరత నాట్య ప్రదర్శన మైమరపింపజేసింది. సందర్శకుల వీక్షణార్థం ఆదివారం సాయంత్రం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బెంగళూరుకు చెందిన ప్రముఖ నర్తకి జయంతి ఆచారి బృందం నాట్య ప్రదర్శన ఇచ్చింది. రెండు గంటల పాటు నాట్యంతో సందర్శకులకు కనువిందు చేశారు. ఇక నుంచి ప్రతి ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. -ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి



భరతనాట్యం చేస్తున్న కళాకారిణులు

భాషా పండితుల ఉద్యోగోన్నతులకు కృషి

- ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి



ఆదిశేషయ్యను సత్కరిస్తున్న ఒంటేరు శ్రీనివాసరెడ్డి

అనంతపురం విద్య, జూలై 20(ఆంధ్రజ్యోతి): భాషాపండితుల ఉద్యోగోన్నతుల కోసం చేపట్టిన పోరాటంలో ఎస్‌ఎల్‌టీఏ (రాష్ట్ర భాషోపాధ్యాయుల సంఘం) పాత్ర ఎంతో ఉందని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని క్రిష్ణకళామందిరంలోని రెవెన్యూభవన్‌లో ఎస్‌ఎల్‌టీఏ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటేరుతో పాటు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంకాలయ్య, ప్రధాన కార్యదర్శి శివానందరెడ్డి మాట్లాడుతూ.. భాషా పండితులకు అందని ద్రాక్షలా ఉన్న ఉద్యోగోన్నతుల ఫలాలు అందించడంలో ఎస్‌ఎల్‌టీఏ పోరాటం ఎంతో ఉందన్నారు. ఈ ఉద్యమంలో అనంత జిల్లా నేతలు ముందుండి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. టీచర్ల సమస్యల సాధన కోసం ఎస్‌ఎల్‌టీఏ తరఫున ముందుంటామన్నారు. జిల్లా ఎస్‌ఎల్‌టీఏ అధ్యక్షుడిగా పనిచేస్తూ ఇటీవల ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొందిన ఆదిశేషయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కరణం హరిక్రిష్ణ, విజయభాస్కర్, విజయలక్ష్మీ, శోభారాణి, ఎర్రిస్వామి, జయపాల్‌నాయుడు, అక్కులప్ప, గుంపు ఆదిమూర్తితోపాటు పలువురు నేతలు, టీచర్లు పాల్గొన్నారు.

దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక దూదేకుల భవనంలో దూదేకుల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు పగిడాల సిద్దయ్య ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సి.మస్తాన్, ప్రధాన కార్యదర్శిగా షెక్షావలి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అక్బర్, గౌరవాధ్యక్షుడిగా బ్రహ్మం, ఉపాధ్యక్షులుగా బాబయ్య, రవీంద్ర, బావాజీ, నబీరసూల్, బాబా, రాజుకుల్లాయప్ప, దస్తగిరి, వన్నూర్‌బీ, అల్లాబకాష్, కార్యదర్శులుగా మహబూబ్ బాషా, సుభాన్, వజీర్‌బాషా, రఫీ, బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన డ్వామా పీడీ సలీంబాషా, చమన్ ఉమర్ ముక్తియార్ మాట్లాడుతూ.. విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, పిల్లల విద్యాభ్యాసం కోసం కృషి చేయాలని తెలిపారు. దూదేకుల సమాజం ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా పురోగతి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఖాసీం, మహబూబ్ సాహెబ్, రఫీ, వన్నూరప్ప, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



రఘునాథ్ రెడ్డి, సావిత్రమ్మ దంపతులు (ఫైల్)

శింగనమల, జూలై20(ఆంధ్రజ్యోతి): మండలం మరువకొమ్మ వద్ద అనంతపురం-అమరావతి రహదారిపై ఆదివారం బైక్‌ను వెనుక నుంచి కారు అతి వేగంగా ఢీకొనడంతో దంపతులు రఘునాథ్‌రెడ్డి (60), సావిత్రమ్మ (55) మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం గుమ్మేపల్లికి చెందిన రఘునాథ్‌రెడ్డి, సావిత్రమ్మ దంపతులు 20 ఏళ్ల క్రితం జిల్లాలోని తాడిపత్రి పట్టణానికి వలస వెళ్లారు. అక్కడ గేదెలు పెట్టుకుని, పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తుండేవాడు. గుమ్మేపల్లిలో ఉంటున్న తన పిన్నమ్మను చూడడానికి రఘునాథ్ రెడ్డి.. ఆదివారం ఉదయం భార్య సావిత్రమ్మతో కలిసి ద్విచక్రవాహనంలో గుమ్మేపల్లికి బయల్దేరాడు. శింగనమల మరువకొమ్మ వద్ద ఉన్న మలుపు వద్దకు రాగానే వెనుకవైపు నుంచి వస్తున్న కారు అతివేగంతో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దంపతులు గాలిలో ఎగిరి పడ్డారు. రఘునాథ్‌రెడ్డికి కాలు తెగిపోయి, తీవ్ర గాయలై, అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన సావిత్రమ్మను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సావిత్రమ్మ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న శింగనమల ఎస్‌ఐ విజయ్‌కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న రమణారెడ్డి

అనంతపురం విద్య, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన టీచర్లకు జీతాలు అందక అవస్థలు పడుతున్నారని, వెంటనే చెల్లించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ.. పొజిషన్ ఐడీలు లేవని జీతాలు ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. ఇందుకు ప్రభుత్వమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు. ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డీఏలు, ఆర్జిత సెలవుల నగదు బకాయిలు, మెడికల్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు సూర్యుడు, శివయ్యాచారి, సురేష్, నారాయణస్వామి, రామక్రిష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తెగులు... దిగులు..!

టమోటా పంటకు మచ్చ



తుడిచిపెట్టుకుపోతున్న తోటలు

తీవ్రంగా నష్టపోతున్న రైతులు



మచ్చ తెగులు సోకడంతో తొలగించిన టమోటా కాయలు

శెట్టూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): టమోటా రైతుకు తెగులు దిగులు పట్టుకుంది. వాతావరణ పరిస్థితుల కారణంగా పంటను మచ్చ తెగులు విపరీతంగా ఆశిస్తోంది. మచ్చ దెబ్బకు తోటలు తుడిచిపెట్టుకుపోతున్నాయి. అంతో కొంతో దిగుబడి చేతికొచ్చినా.. మార్కెట్‌లో ధర ల్లేవు. దీంతో టమోటా రైతు దారుణంగా దెబ్బ తింటున్నాడు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట తరువాత అత్యధికంగా మండలంలో బోరుబావుల కింద టమోటా సాగు చేశారు. మొక్కలు, మందులు, కూలీల ఖర్చులు కలిపి ఎకరాకి రూ.లక్ష పెట్టుబడి పెట్టారు. కాయ దశలో నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు పంటను మచ్చ తెగులు విపరీతంగా ఆశించింది. పలు రకాల మందులు పిచికారీ చేస్తున్నా.. అదుపులోకి రావట్లేదని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో మచ్చ ఏర్పడిన కాయలను రైతులు ఎప్పటికప్పుడు తొలగించేస్తున్నారు. దీంతో పంట దిగుబడి సగానికిపైగా పడిపోయింది. ఎకరాలో సాధారణంగా 200 బాక్సుల దాకా (20 కిలోలవి) దిగుబడి వస్తుంది. మచ్చ తెగులు సోకిన కాయలను పెద్ద సంఖ్యలో తొలగిస్తుండడంతో ప్రస్తుతం 100 బాక్సులు కూడా దిగుబడి రావట్లేదని రైతులు వాపోతున్నారు. వచ్చిన దిగుబడిని అమ్ముకుందామంటే మార్కెట్‌లో ధరలు నేలచూపులు చూస్తున్నాయి. బాక్సు రూ.300తో అమ్ముడుపోతున్నాయి. ఈ లెక్కన రైతుకు రూ.30 వేలు మాత్రమే వస్తోంది. పెట్టుబడి మాత్రం రూ.లక్ష పెట్టారు. వెరసి.. రూ.70 వేల వరకు నష్టం వాటిల్లుతోందని అన్నదాతలు వాపోతున్నారు. తీవ్రంగా నష్టపోతున్నా ఉద్యానవన అధికారులు.. పంటను పరిశీలించి, కనీసం సలహాలు ఇచ్చిన పాపానపోలేదని ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడి కూడా దక్కలేదు



మూడెకరాల్లో టమోటా సాగు చేశా. రూ.మూడు లక్షలదాకా పెట్టుబడులు పెట్టా. మచ్చతెగులు సోకి తీవ్రంగా నష్టపోయా. రూ.2 లక్షలకు పైగా నష్టపోయా.

-చెన్నకేశవ, టమోటా రైతు, మాలేపల్లి

తెగుళ్లు సోకి.. ధరలు లేక..



ఐదెకరాల్లో టమోటా సాగు చేశా. రూ.5 లక్షలు పెట్టుబడులు పెట్టా. తెగుళ్లు సోకి దిగుబడి పడిపోయింది. ధరలు కూడా లేక రూ.3 లక్షలు నష్టపోయా.

-రవి, టమోటా రైతు, మాలేపల్లి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎండ లేకపోవడం, ఆకాశం మేఘావృతంగా ఉండడంతో టమోటా పంటకు మచ్చతెగులు అధికంగా సోకింది. దీని నివారణకు కప్రోఫిక్స్, కాపర్‌సల్ఫేట్, మాంకోజెబ్ లీటరు నీటిలో గ్రాము గానీ, స్ట్రెప్టోసైక్లోన్ 0.25 గ్రాములుగానీ కలిపి, పిచికారీ చేయాలి. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

- గౌసియా, ఉద్యానశాఖ అధికారి

చుక్కలు చూపిస్తున్నారు..!

(3వ పేజీ తరువాయి)

కలెక్టర్ ఇటీవల జరిగిన సమీక్షలో తహసీల్దార్లపై మండిపడినట్లు సమాచారం. ఈ ఫైల్స్‌కు సంబంధించి జిల్లా స్థాయి 22ఏ కమిటీ, డీఎల్సీ సమావేశంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మండలం నుంచి వారానికి ఒక 22ఏ ఫైల్, చుక్కల భూమి ఫైల్ తప్పనిసరిగా ఉండాలంటూ ఆదేశాలిచ్చారు. తహసీల్దార్ కార్యాలయాల్లో మూడు నెలల నుంచి ఏడాది వరకు తిప్పుకుంటున్నారు. పైసలిచ్చిన వారి ఫైల్సే ముందుకెళ్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో పరిశీలన పేరుతో మరో మూడు నెలలు ఆగుతుంది. అక్కడా ముడుపుల వ్యవహారం ముగిశాకే కలెక్టరేట్‌కు వెళ్తుంది. అక్కడ ఏ సీటు వద్ద ఆ ఫైల్ ఉంటుందో సామాన్యులకు తెలియదు. అందుకే ఎన్‌ఓసీ సర్టిఫికెట్‌కు ఉన్న విలువ జిల్లాలో ఏ సర్టిఫికెట్‌కూ లేదు. ఒక్కో ఫైల్ రూ.5లక్షల నుంచి రూ.50లక్షల వరకు పలుకుతోందని సమాచారం. ఆ భూమి ధర ఆధారంగా వారి రేటు నిర్ణయిస్తారని తెలుస్తోంది. ఈ విషయాల్లో మధ్యవర్తులతోనే పనులు జరుగుతాయని సమాచారం. కొందరు తహసీల్దార్లు నేరుగా బేరాలు కుదుర్చుకుంటారని తెలిసింది. జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, గుత్తి, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో 400 నుంచి 700 వరకు ఫైల్స్ పెండింగ్‌లో ఉంటున్నట్లు సమాచారం. మిగిలిన 25 మండలాల్లో ఒక్కో మండలంలో 200 నుంచి 300 వరకు ఉంటున్నట్లు తెలిసింది.

చెక్‌లిస్టులో మార్పులెందుకు...?

ఎన్‌ఓసీ కోసం చుక్కల భూములు, 22ఏ భూములకు సంబంధించి ఫైల్స్ తయారుచేసే విషయంలో తరచూ మార్పులు జరగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాటి చెక్‌లిస్టులో తరచూ మార్పులు చేయమనడంపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గత కొంతకాలంగా చెక్‌లిస్టులో మార్పులు చేయడం విమర్శలకు తావిస్తోంది. సబ్‌డివిజన్ చేసిన డాక్యుమెంట్స్ పొందుపరచాలని ఆదేశించారని సమాచారం. దీంతో వాటిని పంపడంలో మరింత ఆలస్యమవుతోంది. ఇలా మొత్తంపై ఎన్‌ఓసీ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారుతోంది. మరి అధికారుల్లో ఎప్పుడు మార్పొస్తుందో..? ఆ భూములకు ఎన్‌ఓసీ మోక్షం ఎప్పుడొస్తుందో...?కాలమే సమాధానం చెప్పాలి.

ఊరి బడి ఉసూరు..!

(3వ పేజీ తరువాయి)

ప్రభుత్వం 117 జీఓను రద్దు చేసింది. కొత్తగా మోడల్ ప్రాథమిక విద్యావిధానాన్ని తీసుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 9,600 మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేసింది.

222 ఏకోపాధ్యాయ పాఠశాలలు

శ్రీసత్యసాయి జిల్లాలో 32 మండలాలున్నాయి. 29 మండలాల్లో 222 సింగిల్ టీచర్ పాఠశాలలు ఉన్నాయి. అధికంగా అమడగూరు మండలంలో 19, తనకల్లు 18, కదిరి, ఓబుళదేవరచెరువు 15, మడకశిర, ముదిగుబ్బ 10, గోరంట్ల, నల్లచెరువు 9, నంబులపూలకుంట, చిలమత్తూరు 8, తాడిమర్రి, గాండ్లపెంట, రొళ్ల 7, బత్తలపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి, ధర్మవరం మండలాల్లో 6 సింగిల్ టీచర్‌పాఠశాలలు ఉన్నాయి. వీటిలో విద్యార్థులేలేని పాఠశాలలు 10 ఉన్నాయి. 10 మంది విద్యార్థులు ఉన్నవి పది ఉన్నాయి. 1 నుంచి 10 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 196 ఉన్నాయి. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే ప్రభుత్వ పాఠశాలలకు గడ్డుకాలం వచ్చిందని ఉపాధ్యాయ నేతలు మండిపడుతున్నారు.

క్లస్టర్ టీచర్లకు కష్టాలు

ప్రభుత్వం జిల్లాలో 120 క్లస్టర్ పాఠశాలలను ఏర్పాటు చేసింది. డీఈఓ పూల్ కింద ఉన్న తెలుగు స్కూల్ అసిస్టెంట్లను క్లస్టర్ ఉపాధ్యాయులుగా నియమించింది. వీరికి విధివిధానాలను ఇప్పటికీ ప్రకటించలేదు. దీంతో క్లస్టర్ ఉపాధ్యాయులకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. ఉపాధ్యాయుల బదిలీలకు ముందు క్లస్టర్ పోస్టులు ఏర్పాటు చేస్తామనీ, ఇందులో నియమితులైనవారు.. క్లస్టర్ పరిధిలో ఉన్న టీచర్ సెలవు పెడితే.. ఆయా పాఠశాలలకు వెళ్లాలని సూచించారు. ఒక క్లస్టర్ పరిధిలో 10 ఉంచి 20 పాఠశాలలు ఉంటాయి. ఒక క్లస్టర్‌కు ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులను నియమించారు. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఓ ఉత్తర్వును విడుదల చేశారు. ప్రార్థన సమయానికి క్లస్టర్ ఉపాధ్యాయుడు బయోమెట్రిక్ వేయకపోతే గైర్హాజరు కింద పరిగణించి, ఆ రోజు జీతం కూడా చెల్లించకూడదని స్పష్టం చేశారు. దీంతో ఎప్పుడు ఏ పాఠశాలకు వెళ్లాలో, ఏ సబ్జెక్టు బోధించాలో తెలియక క్లస్టర్ ఉపాధ్యాయులు తికమక పడాల్సి వస్తోంది.

ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం



ఒకే ప్రాంతంలో ఫౌండేషన్, 1 నుంచి 10వ తరగతి వరకు ఉండడంవల్ల ఫౌండేషన్ పాఠశాల్లో విద్యార్థులు చేరడంలేదు. దీంతో ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. సమస్యను అధిగమించాలంటే గ్రామీణ ప్రాంతాల్లో 1 నుంచి 5 వరకు బేసిక్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను బలోపేతం చేయాలంటే కామన్ స్కూల్ సిస్టమ్‌ను అమలు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకే రకమైన సిలబస్‌ను ప్రవేశపెట్టాలి.

-చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీటీఎఫ్

సింగిల్ టీచర్ స్కూళ్ల బలోపేతానికి కృషి చేస్తాం

సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సింగిల్‌టీచర్ ఉన్న పాఠశాలల బలోపేతానికి కృషిచేస్తున్నాం.గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పాలంటూ అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలలో 5 సంవత్సరాలు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోచేర్పేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలు మూత పడకుండా గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కిష్టప్ప, డీఈఓ

ప్రజలే.. వైసీపీని రప్పా రప్పా ఆడించారు..

ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

ఆర్థిక ఇబ్బందులున్నా హామీలు అమలు చేస్తున్నాం: ఎంపీ బీకే

పనులు చేసి.. ప్రతి ఇంటికీ ధైర్యంగా వెళ్తున్నాం: ఎమ్మెల్యే సునీత



కనగానపల్లిలో ప్రజలతో సెల్ఫీ దిగుతున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే

కనగానపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ప్రజలే.. వైసీపీని రప్పా రప్పా ఆడించి పదకొండుకు పరిమితం చేశారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి చేస్తామని చెప్పాల్సిన వైసీపీ నాయకులు ఎక్కడ మాట్లాడినా 'రప్పా రప్పా, చీకట్లోనే ముగించేయాలి' అంటూ వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో కనగానపల్లిలో ఆదివారం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి పాల్గొన్నారు. ముందుగా బీసీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నాయకులు ఆరాతీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలకిచ్చిన హామీలు కొన్ని అమలు చేశామనీ, రాబోవు కాలంలో మరిన్ని చేస్తామన్నారు. కరువు జిల్లాగా పేరుగాంచిన అనంతపురం నారా చంద్రబాబునాయుడు కృషితో పారిశ్రామిక, హార్టికల్చర్ హబ్‌గా మారిందన్నారు. త్వరలోనే రామగిరి బంగారు గనులు తెరిపించి, ఉపాధి కల్పిస్తామన్నారు. అనంతరం ఎంపీ బీకే పార్థసారధి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా పనులు చేపడుతున్నారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. రాప్తాడులో రిజర్వాయర్లు ఏర్పాటుతోపాటు రామగిరి బంగారు గనులు తెరిచేలా చర్యలు తీసుకోవాని మంత్రి దృష్టికి తెచ్చారు. అంతకుముందు మంత్రి బెంగళూరు నుంచి రోడ్డుమార్గాన వస్తూ చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టులో ఆగారు. ఎక్సైజ్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. మద్యం అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, డీసీఎంస్, రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి, మండల కన్వీనర్ యాతం పోతులయ్య, సర్పంచ్ అంకే పరిమళ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, తెలుగు యువత సురేష్‌చౌదరి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కోశాధికారిగా తిరుపాలయ్య



ఉరవకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కోశాధికారిగా వజ్రకరూరు మండలం గూళ్యపాల్యం గ్రామానికి చెందిన డీలర్ తిరుపాలయ్య ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలోని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి రేషన్‌డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్ల సమస్యలపై తనవంతుగా పోరాడతానన్నారు.

నవ వరుడు ఆత్మహత్య



రమేష్ నాయుడు (ఫైల్)

గార్లదిన్నె, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.. రెండు నెలలు కాకుండానే నవదంపతుల మధ్య చిన్నపాటి మనస్పర్థలు తలెత్తాయి.. ఇంతలో క్షణికావేశంతో నవ వరుడు ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన చోటు చేసుకుంది. గార్లదిన్నె మండలంలోని తిమ్మంపేట సమీపంలో ఆదివారం సాయంత్రం రమేష్‌నాయుడు (30) అనే నవ వరుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన రమేష్‌నాయుడు అనే యువకుడు కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. రెండు నెలల క్రితం అనంతపురం పట్టణ సమీపంలోని లేపాక్షి నగర్‌కు చెందిన మానస అనే యువతితో ప్రేమ వివాహమయింది. ఇటీవల దంపతుల మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో మానస పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపం చెందిన చెందిన రమేష్‌నాయుడు ఆదివారం సాయంత్రం తిమ్మంపేట సమీపంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్ర్య పోరాటతత్వాన్ని

భవిష్యత్తు తరాలకు ఇవ్వడం హర్షణీయం

సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోపాల్ గౌడ్

భారతీయ ముస్లిం లెజెండ్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ గోపాల్‌గౌడ్, గజల్ శ్రీనివాస్ తదితరులు

హిందూపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటతత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందివ్వడం హర్షణీయమని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'భారతీయ ముస్లిం లెజెండ్' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ న్యాయమూర్తి మాట్లాడుతూ.. దశాబ్దాలపాటు కృషిచేసి 150 మంది ముస్లిం లెజెండ్స్‌కు పుస్తక రూపంలో ఇవ్వడం గొప్ప విషయమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది ముస్లింలు పోరాటాలు చేశారన్నారు. వారి పోరాటాలను ఓ పుస్తక రూపంలోకి తీసుకొచ్చి భవిష్యత్తు తరాలకు తెలియజెప్పడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. గాయకుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కనుమరుగవుతున్న ముస్లింల చరిత్రను వెలికితీసి పుస్తక రూపంలో ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ న్యాయమూర్తి.. స్వాతంత్ర్య సమర యోధుడు మెళవాయిగోవిందరెడ్డికి పుస్తకాన్ని అందజేశారు. పుస్తకాన్ని తన తల్లికి అంకితం ఇస్తున్నట్లు రచయిత ఉమర్ ఫారూక్ పేర్కొన్నారు. అనంతరం సాహితీవేత్తలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం నాయకులు జాబిలి చాంద్‌బాషా, కళారత్న బిక్కికృష్ణ, విద్యాధర్‌రావు, డా.ఉమర్‌అలీషా, అనంతరాముడు, మహేష్, మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత జీవితం

- జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి శివశంకర్



ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి, చైర్‌పర్సన్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): విద్యతోనే జీవితాన్ని ఉన్నత స్థానాల్లో నిలుపుకుని, ఆత్మగౌరవంతో బతకొచ్చని జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల ఆవరణంలో రజక ఉద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి అధ్యక్షతన ప్రతిభ కనబరిచిన రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా స్పెషల్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజకుల్లో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు వస్తుండడం శుభపరిణామం అన్నారు. రజకులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతో వృత్తి నుంచి విముక్తి పొంది సమాజంలో తలెత్తుకుని తిరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఏపీ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి మాట్లాడుతూ.. ప్రతి రజకుడు తమ పిల్లలను కచ్చితంగా చదివించాలని, ఆత్మగౌరవంతో జీవించాలని తెలిపారు. నమ్మకానికి, విశ్వాసానికి, శ్రమకు రజకులు ప్రతిరూపంగా నిలుస్తున్నారని అన్నారు. అంతకు ముందు మడివాళ మాచిదేవి, ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 51మంది రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రజక కార్పొరేషన్ డైరెక్టర్లు ఎన్‌సీ పరమేశ్వర్, రామాంజనేయులు, బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాములు, రజక సంఘం కృష్ణ, బీజేపీ నాయకులు ఆనంద్, బయన్న, రజక నాయకులు నాగరాజు, పద్మావతి, శివప్ప పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.31

అనంతపురంరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.31తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. ఆదివారం మార్కెట్‌కు 1950 టన్నుల టమోటా కాయలు వచ్చాయని పేర్కొన్నారు. అదేవిధంగా టమోటా కిలో కనిష్ట ధర రూ.13, సరాసరి ధర రూ.20తో విక్రయాలు జరిగాయని వివరించారు.

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యేల పర్యటన

ఓబుళదేవరచెరువు, జూలై 20(ఆంధ్రజ్యోతి): 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలకేంద్రం లోని ఎస్సీకాలనీలో ఎమ్మెల్యే పల్లెసింధూరరెడ్డి పర్యటించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరవుతారన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై కరపత్రాలతో వివరిస్తారన్నారు. అనంతరం ఓడీసీ సహకార సంఘం నూతన అధ్యక్షుడు తుమ్మల మహబూబ్ బాషా ప్రమాణ స్వీకారానికి వారు హాజరువుతారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాలని కోరారు.

● తనకల్లు: మండలకేంద్రంలో సోమవారం నిర్వహించే 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానిని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరుకానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

'సంస్కృతిని కాపాడుకుందాం'

ధర్మవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడడం ప్రతిఒక్కరి బాధ్యత అని రామదండు నిర్వాహకులు అన్నా లక్ష్మీనారాయణ, కల్లుమడి సుకుమార్, చౌటుపల్లి వినేశ్ తెలిపారు. ప్రతి ఆదివారం రామదండు ఆధ్వర్యంలో పట్టణంలోని ఒకరి నివాసంలో శ్రీరాముని పూజించి, శ్రీరామ నామసంకీర్తనతో పాటు హనుమాన్‌చాలీసా పఠిస్తున్నారు. ఈ వారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు నివాసంలో 32వ రామదండు కార్యక్రమం నిర్వహించారు.

నిరుపయోగంగా నీటి ట్యాంకులు



విజయనగర కాలనీలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకులు

కొత్తచెరువు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజయనగర కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద ఐదు నెలల క్రితం నూతనంగా తాగునీటి ట్యాంకులు నిర్మించారు. ఒక్కొక్కదాని నిర్మాణానికి రూ. 60వేలు చొప్పున వెచ్చించారు. అయితే వీటిని నిర్మించి ఐదు నెలలు కావస్తున్నా వాటిని తాగునీరు వదలడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలు మార్లు పంచాయతీ సర్పంచ్‌కు, ఈఓకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి తాగునీటి ట్యాంకులకు నీరు వదిలేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ధర్మవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రపంచ స్థాయిల్లో పోటీపడే నైపుణ్యాలను పెంపొందిం చుకోవాలని కేమ్‌బ్రిడ్జి ఇంగ్లీషు శిక్షకురాలు దివ్యానికపూర్ పేర్కొన్నారు. ఆధునిక విద్యాపద్ధతులు, అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లీష్ మాట్లాడే సమర్థత, అంతర్జాతీయ బోధనా నైపుణ్యాలపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చేందుకు ఢిల్లీ బృందం ఆదివారం పట్టణంలోని రిషీ విద్యాలయానికి వచ్చిందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కరుణస్వరూప్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాస్కర్, సీఏఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఏఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

నాలుగు గొర్రెల మృతి

ఓబుళదేవరచెరువు, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్లపల్లిలో రవి అనే వ్యక్తికి చెందిన నాలుగు గొర్రెలు నాము(లేత) గడ్డి తిని ఆదివారం మృతిచెందాయి. రోజు లాగే ఆదివారం కూడా తన నాలుగు గొర్రెలను మేతకు తోలుకెళ్లామని బాధిత రవి పేర్కొన్నారు. నాలుగు గొర్రెలు కోతకోసిన ఓ పంట పొలంలో మళ్లీ మొలకెత్తన నామెక్కిన గడ్డిని తిని అక్కడిక్కడే మృతిచెందినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తనకు రూ. 50వేలు నష్టం వాటిల్లిందని తెలిపాడు. గొర్రెలే జీవనాధారంగా ఉన్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తండ్రిపై కొడుకు దాడి

ధర్మవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గూడ్‌షెడ్ కొట్టాలలో ఓ వ్యక్తిపై అతడి కొడుకు దాడి చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. గూడ్‌షెడ్ కొట్టాలకు చెందిన ఏటూరి మహేష్, అతడి భార్య మహాలక్ష్మి చిన్న సమస్యపై శనివారం గొడవ పడ్డారు. దీంతో శనివారం రాత్రి మహేష్ పెద్దకుమారుడు సతీశ్ తండ్రిపై దాడిచేశాడు. ఈ దాడిలో మహేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన మహేష్‌ను అతడి అన్న కుమారుడు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ ప్రథమ చికిత్స అనంత రం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహేష్ ఫిర్యాదు మేరకు కుమారుడు సతీష్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

పాఠశాల పరిసరాల్లో అపరిశుభ్రత



పాఠశాల గేటు ఎదుట పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్కలు

ధర్మవరం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బడన్నపల్లి ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాల ప్రహరీ లోపల, బయట కంపచెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు భయాందోళనకు గురవుతు న్నారు. కంపచెట్లు పెరిగి, పిచ్చి మొక్కలు ఉండటంతో విషపురు గులు, పాములు సంచరించే అవకాశం ఉందని, గతంలోనూ ఆ ప్రాంతంలో కనిపించాయని విద్యార్థుల తల్లిదండ్రులు భయాం దోళనకు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల చుట్టూ అపరిశుభ్రత నెలకొందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంతో ప్రభుత్వం పరిశుభ్రతపై ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా ఇక్కడ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నారనే విషయం స్పష్టమవుతోందని మండి పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో, ప్రహరీ బయట ఉన్న అపరిశుభ్రతను తొలగించి విద్యార్థులు భయాందోళన లేకుండా పాఠశాలకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

తవ్వారు... వదిలేశారు



గుంతలు తవ్వి వదిలేసిన దృశ్యం

● ఏడు నెలల క్రితం డ్రైనేజీ కోసం తవ్వకాలు
● అలాగే వదిలేయడంతో పేరుకుపోతున్న మురుగు
● తరచూ ప్రమాదాలు

ఓబుళదేవరచెరువు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మురుగునీటి కాలువ నిర్మాణం కోసం ఏడునెలల క్రితం మండలకేంద్రంలోని చెరువు మరవ ప్రాంతం, ప్రభుత్వ పాల డెయిరీ వెనుక వీధిలో గుంతలు తవ్వారు. ఆ తరువాత మురుగునీటి కాలువ పనులు చేపట్టలేదు. దీంతో ప్రజ లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు రాత్రి సమయంలోనే కాకుండా పగటిపూట కూడా గుంతల్లో పడి గాయాల పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. వీటికి తోడు పూడ్చని కాలువలో మురుగునీరు పేరుకుపోవడంతో దోమలు పెరగడంతో పాటు దుర్వాసన భరించలేకున్నామని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఫలితంలేదని వాపోతున్నారు.

ఇంకెన్నాళ్లు ఈ కష్టాలు?

ఒకటి, రెండు రోజులు కాదు ఏకంగా ఏడు నెలలుగా ఇళ్ల ఎదుట మురుగునీటి కాలువల కోసం తవ్వి వదిలేశారు. దీంతో ఇళ్లలోకి రావాలన్నా, ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలన్నా, ఆచితూచి అడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ మాత్రం ఆదమరిచినా ఆ గుంతల్లో పడి కాళ్లు చేతులు విరగక తప్పదని స్థానికులు వాపోతున్నారు. అసలే చిన్నపాటి వీధులు, వాటికి తోడు కాలువలు తవ్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వాహనం వెళ్లాలంటే ఎదురుగా వస్తున్న వాహనం ఆగిన తరువాతే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే తవ్విన కాలువల్లో చెత్తచెదారం పేరుకుపోవడంతో పాటు ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు ఆ కాలువల్లోకి వెళ్తోంది. దీంతో స్థానికులు దుర్వాసన భరించలేక పోతున్నారు. అంతేగాకుండా దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో జ్వరాల బారిన పడాల్సి వస్తోందని ఆయా ప్రాంత వాసులు ఆవేదన చెందుతున్నారు. ఇళ్లలోకి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు గుంతలపై కట్టెలు, బండలు వేసుకుని వారు కాలం గడుపుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని గతంలో పలుమార్లు అధికారులు, పంచాయతీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని స్థానికులు వాపోతున్నారు. కనీసం కాలువను పూడ్చివేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఈఓఆర్డీ అంజనప్పను వివరణ కోరగా కాలువలు తవ్వి వదిలేసిన విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. తాను విధుల్లోకి కొత్తగా వచ్చానని, పరిశీలించి తగు చర్యలు చేపడతామని తెలిపారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు



తవ్విన కాలువలను పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఫలితంలేదు. గుంతలను అలాగే వదిలేయడంతో, ప్రమాదాలు జరుగుతున్నాయి. తవ్విన కాలువలో ఇటీవల పడి ఇద్దరు, ముగ్గురికి రక్తగాయాలైన సంఘటనలు ఉన్నాయి.
- ఎంఎస్ షబ్బీర్, ఓడీచెరువు

ఎన్నాళ్లీ అగచాట్లు..?



నెలలు గడుస్తున్నా, మా కష్టాలు ఎవరికీ పట్ట లేదు. కాలువలు తవ్వి వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం, కాలువలో మురుగు పేరుకుపోవడంతో దోమలు అధికమై, రోగాల బారిన పడే అవకాశముంది. అధికారులు కాలువలైనా నిర్మించాలి లేదా తవ్విన గుంతలైనా పూడ్చాలి.
-లక్ష్మీదేవి, డెయిరీ వెనుక వీధి, ఓడీచెరువు

దోమలను భరించలేకున్నాం



తవ్విన కాలువలో మురుగునీరు నిలువ ఉండడంతో, దోమలు పెరుగుతున్నాయి. దీంతో దోమల బారిన పడాల్సి వస్తోంది. బయటకు వెళ్లాలంటే వృద్ధులు, పిల్లలు ఎక్కడ పడతారో అన్న భయం కలుగుతోంది. చాలామార్లు పంచాయతీ వారికి చెప్పినా పట్టించుకోలేదు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించాలి.
- బాను, ఓడీచెరువు

భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం



మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

ధర్మవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివానగర్‌లోని ఆలయం వద్ద గాయత్రి దీప మహాయజ్ఞాన్ని ఆదివారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. శివాలయంలో గాయత్రీ పరివార్, శివానగర్ శివాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 108 కుండమలు ఏర్పాటు చేసి గాయత్రి దీప మహాయజ్ఞాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అంతకు మునుపు ఆలయంలో శివుడికి ప్రత్యేకపూజలు చేశారు. యజ్ఞ నిర్వాహకులు ప్రసాద్, పరిశే సుధాకర్, దాసరి రంగయ్య, పామిశెట్టి శివశంకర్, గుండా పుల్లయ్య, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రత.. అందరి బాధ్యత

● మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిశుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున, పట్టణ పరిశుభ్రత విషయంలో కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కావున ప్రతి వార్డులోని ప్రజలు, దుకాణదారులు, తోపుడుబండ్ల వ్యాపారులు తదితరులు చెత్తను ప్లాస్టిక్ డ్రమ్ములో వేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. ట్రాక్టర్‌ల ద్వారా ఆ చెత్తను సేక రిస్తామని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల అపరిశుభ్రత ఏర్పడుతుందని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరు అన్ని వార్డులలో చెత్తసేకరణ కోసం ట్రాక్టర్‌లు వస్తాయని ఆయన తెలిపారు. సమ్మెను నియంత్రించడానికి పారిశుధ్యకార్మికుల నాయకులతో త్వరలో చర్చలు జరుపుతామని అన్నారు. కావున ప్రజలు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది

కదిరి అర్బన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఓ ప్రయాణికుడు బస్సులో పోగొట్టుకున్న పర్సును అతడికి అందజేసి ఆ కండక్టర్ నిజాయతీ చాటుకున్నారు. ఆదివారం కదిరి నుంచి మదనపల్లికి వెళ్లే బస్సులో మహబూబ్‌బాషా అనే వ్యక్తి ప్రయాణం చేశాడు. మదనపల్లిలో ప్రయాణికులు బస్సు దిగి వెళ్లిపోయాక, బస్సులోనే పడిఉన్న పర్సును కండక్టర్ టీజీ ప్రసాద్, డ్రైవర్ రుద్ర నాయుడు గమనించారు. పర్సులో ఉన్న ఆధార్ కార్డులోని ఫోన్ నంబర్‌కు ఫోన్ చేసి, పర్సును అప్ప గించారు. మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో పర్సును అప్పగించిన డ్రైవర్, కండెక్టర్‌కు మహబూబ్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ప్రాణాలతో చెలగాటమాడిన వైసీపీ

● టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ

పుట్టపర్తి రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో కల్తీ మద్యం విక్రయం వల్ల వేల మంది ప్రాణాలు కోల్పోయారని తెలుగు దేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిని మద్యం కుంభం కోణం కేసులో సిట్ అరెస్టు చేయడం ప్రజల అభిమతానికి అనుగుణంగా, ప్రజాస్వామ్య విజయానికి హేతువుగా ఉందన్నారు. ఆయన ఆదివారం పుట్టపర్తిలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనా కాలంలో బాధ్యత వ్యవహరించాల్సిన ప్రజాప్రతినిధులు, నాయకులే అక్రమ మద్యం వ్యాపారంలో పాలుపంచుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసులో మరిన్ని నిజాలు బయటకు వస్తాయని అందులో ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డితో పాటు పలువురు జైలుకు వెళ్లవచ్చని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధికి చిరునామా టీడీపీ: నాయకులు



చిన్నకోట్లలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, జూలై 20(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చిరునామా తెలుగుదేశం పార్టీ అని మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని చిన్నకోట్ల గ్రామంలో ఇంటింటికి తిరిగి అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు నారాయణస్వామి, అశోక్, కొండయ్య, రాజు, రాజశేఖర్, సుమంత్, అబ్దుల్, చంద్ర, రామ్మూర్తి, నరేంద్ర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గాండ్లపెంటలో...

గాండ్లపెంట, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమతంపల్లిలో ఆదివారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ వెంకటరమణ, బూత్ కన్వీనర్ రామాంజులు, అమర్‌నాథ్‌రెడ్డి, చెన్నకేశవులు, బయప్ప తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ధర్మవరం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణం లోని కొత్తపేటలో ఉన్న శ్రీపిన్ని చంద్రాయప్పశ్రేష్ఠి మున్సి పల్ హైస్కూల్ (రైల్వే స్కూల్)లో 1989-90లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నాటి అనుభూతులను గుర్తుచేసుకుంటూ సందడిగా గడిపారు. ఒకరినొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

వీధికుక్కల బెడద



ఓ వీధిలో గుంపుగా చేరిన కుక్కలు

తనకల్లు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తారక రామానగర్, ఇందిరానగర్, మెయిన్ రోడ్డులో వీధికుక్కల విజృంభణ ఎక్కువైంది. ప్రతిరోజు వీధి కుక్కలు గుంపులు గుంపులుగా వీధుల్లో తిరుగుతూ స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి సమయంలో అవి చేసే గోల(అరుపులు) భరించలేక జనం ఇబ్బందులు పడుతున్నారు. వీధి కుక్కలు గుంపులు గుంపులుగా చేరి పొట్లాడుకుంటున్నాయి. ఈ సందర్భంగా వాటి అరుపులు భరించలేకపోతున్నారు. వీధి కుక్కలను అదుపు చేయాలని ప్రయత్నించే మనుషులపై దాడులు చేస్తున్నాయి. అలాగే చిన్నారులు, మహిళలు రాత్రి సమయంలో రోడ్డుపైకి రావడానికి జంకుతున్నారు. వీధికుక్కల బారినుంచి ప్రజలను కాపాడాలని అధికారులకు, పంచాయతీ వారికి విన్నవించినా ఫలితంలేదనా స్థానికులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకల్లులో వీధి కుక్కల బాధలేకుండా చేసేందుకు తగిన చర్యలు ప్రజలు కోరుతున్నారు.

దుర్గమ్మ, పెద్దమ్మకు బోనాలు



బోనాలు మోసుకెళ్తున్న మహిళలు

ధర్మవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గమ్మ, పెద్దమ్మ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా గ్రామ దేవతలైన దుర్గమ్మ, పెద్దమ్మకు బెస్తవీధి, కాగితాల వీధికి చెందిన మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించి, మొక్కులు తీర్చుకున్నారు.

● గాండ్లపెంట: వర్షం కోసం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలకు జ్యోతులు, బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. పోతవాండ్లపల్లి, సోమయాజులపల్లి, తూపల్లి, కటకంవారిపల్లి, జురుకువాండ్లపల్లిల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. వర్షాం కోసం అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, సకాలంలో వర్షం కురవాలని కోరుకున్నట్లు ప్రజలు తెలిపారు.



జురుకువాండ్లపల్లిలో గంగమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం

జలధికి తరలిన పీర్లు



ఏలుకుంట్లలో జలధికి వెళ్తున్న పీర్లు



చింతలపల్లిలో...

ధర్మవరంరూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల, చింతలపల్లిల్లో ఆదివారం పీర్లను జలధికి తరలించారు గ్రామస్థులు పెద్దఎత్తున చక్కెర చదివింపులు చేసి, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను జలధికి తీసుకెళ్లారు. యువకులు, పెద్దలు అలావు తొక్కుతూ సందడి చేశారు.



బుక్కపట్నంలో...

● బుక్కపట్నం: మొహర్రం సందర్భంగా బుక్కపట్నంలో ఆదివారం పీర్ల జలధిని ఘనంగా నిర్వహించారు. తోట, పేట వీధుల్లో పీర్లచావిడిలో కొలువుదీరినపీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం పీర్లను గ్రామంలో ఊరేగించి, అగ్నిగుండం ప్రవేశం చేశారు. సాయంత్రం జలధికి తరలించారు.

● తాడిమర్రి: మండల పరిధిలోని పిన్నదరి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామునే పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించి, గ్రామంలో ఊరేగించారు. తిరిగి సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం అనంతరం పీర్లను జలధికి తరలించారు.



పిన్నదరిలో పీర్ల అగ్నిగుండ ప్రవేశం



కత్తివారిపల్లిలో జలధికి తరలుతున్న ఉరుసు పీరు

● గాండ్లపెంట: మండలపరిధిలోని సోమయాజులపల్లి పంచాయతీ కత్తివారిపల్లిలో ఆదివారం పీర్ల జలధి నిర్వహించారు. గ్రామంలో ఉరుసుపీరును కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. ఆదివారం జలధికి తరలించారు.



మహమ్మదాబాద్ గ్రామంలో కొలువుదీరిన పీర్లు

● అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో కొలువుదీరిన పీర్లను ఆదివారం జలధికి తరలించారు. ముందుగా గ్రామంలో పీర్లను ఊరేగించారు. గ్రామస్థులు చక్కెర చదివింపులు, ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.



నల్లచెరువులో అలావు తొక్కుతున్న యువత

● నల్లచెరువు: మండల వ్యాప్తంగా ఆదివారం మొహర్రం వేడుకలు నిర్వహించారు. మండలకేంద్రంలోని బసవన్నకట్ట సమీపంలోని పీర్ల చావిడి, కొత్తపల్లి, పెద్దయల్లంపల్లి, పూలకుంట పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లను అలంకరించి, ప్రార్థనలు చేశారు. ఆదివారం జలధి సందర్భంగా యువత పీర్లను దర్శించుకుని అగ్నిగుండం చుట్టు అలావు తొక్కారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

పార్టీ అండగా ఉంటుంది: ఎమ్మెల్యే


కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న నాయకులు

మడకశిరరూరల్, జూలై20(ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి కోట్ల రంగేగౌడ్ తండ్రి అశ్వత్థప్ప అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి టీడీపల్లి గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట మండల కన్వీనర్ నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కేబుల్ వైరు చోరీ

ఆందోళనలో రైతులు

చిలమత్తూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కేబుల్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. శనివారం రాత్రి మండలంలోని కోడూరు గ్రామ పరిసరాల్లో ఏకంగా 11 బోరుబావులకు సంబంధించిన కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. కోడూరు గ్రామ పంచాయతీకి చెందిన నాలుగు తాగునీటి బోర్లతోపాటు ఏడుగురు రైతులకు సంబంధించిన వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లారు. ఇటీవల కాలంలో కేబుల్ వైర్ల చోరీ అధికమైందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక ఉన్న నీటితో పంటలను సాగు చేసుకుంటున్నామని, మరోవైపు కేబుల్‌వైర్ల చోరీ తమకు నిద్రలేకుండా చేస్తోందని అంటున్నారు. పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదుచేయనున్నట్లు కోడూరు సర్పంచ్ మురళీమోహన్, రైతులు తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి చోరీకి పాల్పడుతున్నటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు 'ఇంటింటికీ గంగ' విడుదల

హాజరుకానున్న సీఎం సిద్దరామయ్య


నీటిని శుద్ధి చేసే యంత్రాలు

పావగడ, జూలై 20(ఆంధ్రజ్యోతి): 'ఇంటింటికీ గంగ' పేరుతో తుంగభద్ర నీటిని నేడు సిద్దరామయ్య విడుదల చేయనున్నారు. మూడు దశాబ్దాల నుంచి ఫ్లోరైడ్ రహిత నీటితో దాహం తీర్చుకోవాలన్న పావగడవాసుల కల నేడు సాకారం కానుంది. ఎన్నోఏళ్లుగా పలు స్వచ్ఛంద, సేవా సంస్థలు, రైతులు తమకు ఫ్లోరైడ్ రహిత నీరు అందించాలని పోరాటాలు చేశారు. ఆ పోరాటాల ఫలితం నేడు సాకారం కానుంది. హాస్పేట్ డ్యాం నుంచి 230 కిమీలు కూడ్లగి, ములకలమూరు, చలికెర మీదగా పావగడకు తుంగభద్ర నీరు అందించేందుకు పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. సీఎం రానున్న సందర్భంగా తుమకూరు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

కమిటీ ఎంపిక


మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

గోరంట్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. పట్టణంలోని మాధవరాయ ఆలయంలో మండల కమిటీ అధ్యక్షులు ముద్దల వెంకటరాముడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. నూతన అధ్యక్షులుగా బాబాజాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సాంబశివ, కోశాధికారి ముత్యాలప్పతోపాటు 16మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ భవననిర్మాణ కార్మిక సంఘం, ఇతర నిర్మాణ రంగ కార్మికులతో కలిసి కార్మికుల ఐక్యత, సంక్షేమకోసం రాజీలేని పోరాటం సాగిస్తామని పేర్కొన్నారు.

విజయవంతం చేద్దాం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

గుడిబండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి అనిత పర్యటనను విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని రాళ్లపల్లి శంకర్‌గల్లు గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం గుడిబండలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమానికి హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మండల కార్యదర్శి శ్రీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జి భీమరాజు, నాయకులు జయరామప్ప, లక్ష్మీనారాయణ, నజీర్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పెనుకొండ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం మంత్రి సవిత బాధితులకు పంపిణీ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 21 మందికి రూ.13.61 లక్షల చెక్కులను పంపిణీ చేశారు.

శరవేగంగా ఎంజేపీ పాఠశాల అభివృద్ధి పనులు

రూ.18 కోట్లు మంజూరు చేసిన మంత్రి సవిత


నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం

రొద్దం, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఆగిపోయిన రొద్దం ఎంజేపీ పాఠశాల నిర్మాణ పనులకు మంత్రి సవిత రూ.18కోట్లు నిధులను మంజూరు చేయడంతో పనులు ఊపందుకున్నాయి. రొద్దం మండల పరిధిలోని ఆర్.మరువపల్లిలో ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం రూ.15కోట్లతో పనులు ప్రారంభించగా అవి అర్థంతరంగా ఆగిపోయాయి. కాంట్రాక్టర్ వెంకటరెడ్డి ఉన్నంతవరకు పనిచేసి బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేసి వెళ్లిపోయాడు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత చొరవ తీసుకుని రూ.18కోట్లు నిధులు మంజూరు చేయించారు. దీంతో ఎంజేపీ పాఠశాల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. డార్మెంటరీ గదికి టాప్‌లెవెల్ కాగా ప్రిన్సిపాల్ గదికి సున్నం వేయించారు. తరగతి గదుల పనులు జోరుగా జరుగుతున్నాయి. ఏడాదిలోపే పాఠశాల నిర్మాణ పనులు పూర్తయితే విద్యార్థుల ఇబ్బందులు తీరుతాయని తల్లిదండ్రులు గంపెడాశలతో ఎదురుచూస్తున్నారు. ఐదేళ్లుగా ఆగిపోయిన పనులు ఊపందుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం వీడిన అధికారులు

జెండా వద్ద శుభ్రం


మువ్వెన్నెల జెండా వద్ద శుభ్రం చేసిన దృశ్యం

హిందూపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొట్నూరు చెరువు మరువవద్ద మువ్వెన్నెల జెండా వద్ద అందంగా రూపొందించారు. ఉదయం, సాయంత్రం అటుగా వెళ్లేవారు జెండావద్ద సెల్ఫీలు తీసుకునేవిధంగా అక్కడ కూర్చునేందుకు సిమెంటు బెంచీలు ఏర్పాటుచేశారు. కొంతమంది ఆకతాయిలు సిమెంటు బెంచీలు ధ్వంసం చేశారు. మువ్వెన్నెల జెండా ఆధారంగా ముళ్లచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో ఈనెల 16న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'జెండాపై నిర్లక్ష్యం.. శిథిలమవుతున్న ఆకారం' కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు పెద్ద ఆకారం చుట్టూ శుభ్రం చేశారు. అదేవిధంగా సిమెంటు బెంచీలు ఏర్పాటుచేసి లైట్లుకూడా ఏర్పాటు చేస్తామన్నారు.

కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పెనుకొండ, జూలై20(ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవసేవగా భావించి పేద ప్రజల కోసం ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టిన శివసాయిమందిరం వ్యవస్థాపకులు దివంగత డాక్టర్ సాయి కాళ్వేర్ ఆశయసాధనకు తనవంతు కృషిచేస్తున్నట్లు షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నవ్యశ్రీ, శిల్ప ఆధ్వర్యంలో ఉచిత వినికిడి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరా నికి 137మంది హాజరుకాగా వారిని వైద్యులు రిచర్డ్ పరీక్షలు నిర్వహించారు. అందులో 87మందికి ఉచిత వినికిడి యంత్రాలు, బ్యాటరీలను శిల్ప చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు చిట్టిబాబు, హరి, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటాలు: సీపీఐ


నూతన కమిటీని అభినందిస్తున్న నాయకులు

పెనుకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు అన్నారు. ఆదివారం స్థానిక ఎంక్యూయూ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి మహాసభలను శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షాన పోరాటంచేసి ఎంతో మందికి కష్టాల నుంచి విముక్తి కల్పించిందన్నారు. ఈనెల 31, ఆగస్టు 1న ధర్మవరంలో జరిగే జిల్లాస్థాయి మహాసభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం నియోజకవర్గం, మండల స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. నియోజకవర్గం కమిటీ కార్యదర్శిగా శ్రీరాములు, మండల కార్యదర్శిగా నరసింహులు, సహాయకార్యదర్శి మల్లికార్జునతోపాటు పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చౌడేశ్వరి ఉత్సవాలకు ఆహ్వానం


మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సీసీ హరి

సోమందేపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవానికి రావాలని తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీహరి మంత్రి సవితను ఆదివారం ఆహ్వానించారు. పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ప్రతిఏటా వైభవంగా ఉత్సవం జరుగుతుందని వివరించారు.

ఫుట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం క్రీడా మైదానంలో ఆదివారం ఫుట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. ఫుట్‌బాల్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో సీనియర్ పురుషులు, మహిళా జట్లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చి ప్రతిభ చాటిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం కోశాధికారి శేఖర్, కార్యదర్శి సలీం, విజయవాణి పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు: ఎస్ఐ

పరిగి, జూలై 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రంగడుయాదవ్ హెచ్చరించారు. ఊటకూరు పంచాయతీ పరిధిలోని చుట్టుపక్కల ప్రాంతాల రైతులు ఊటకూరు చెరువు నుంచి అనుమతిలేకుండా బంక మట్టిని పొలాలకు తరలిస్తుండగా పోలీసులు అడ్డగించారు. స్థానిక రైతు కిష్టప్ప మాట్లాడుతూ తమ సొంత పొలాలకుచెరువు నుంచి బంక మట్టిని తరలించుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేస్తే పోలీసులు ట్రాక్టర్లను అడ్డగించి అనుమతులు పొందిన తరువాతే తరలించుకోవాలని తెలుపడం జరిగిందన్నారు. ఈ విషయమై ఎస్ఐ రంగడుయాదవ్‌ను మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అనుమతులు పొంది రైతులు తమ పొలాలకు యథేచ్ఛగా బంకమట్టిని తరలించుకోవచ్చని సూచించారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీ హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే సుప్రభాతసేవ, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం అర్చకులు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ తెలిపారు. సిద్ధేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వర స్వామి, విరూపాక్షిస్వామిని ప్రత్యేకంగా వెండి కవచం తొడిగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో అర్చకులు సిద్ధలింగేశ్వరస్వామి, శివకుమారస్వామి, రవిశంకర్‌స్వామి, మహేష్, కుమారస్వామి, ప్రదీప్‌గౌతం తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కోగిరకు కోటా శ్రీనివాసరావు పురస్కారం


పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

పెనుకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కోగిర జయచంద్రారెడ్డి సినీనటుడు దివంగత కోటాశ్రీనివాసరావు స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం హిందూపురంలోని సెవెన్ హిల్స్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన భారతీయ ముస్లిం లెజెండ్ పుస్తకావిష్కరణలో భాగంగా తెలుగు సాహిత్య అకాడమీ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో విశిష్ట ప్రతిభ కనబరచిన సాహిత్యవేత్తలను, కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా కళారంగంలో కోగిర జయచంద్రారెడ్డికి కోటా శ్రీనివాసరావు పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. హిందూపురం మున్సిపల్ చైర్మన్ రమేష్, సంస్థ సభ్యులు ఉమర్‌ఫారూక్, జాబిలి చాంద్ బాష, రవిశంకర్ గురూజీ ఈ పురస్కారాన్ని అందించారు.

వేతన బకాయిలు చెల్లించండి: ఏఐటీయూసీ

పెనుకొండ రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి వాటర్ వర్కర్లకు వెంటనే పెండింగ్ జీతాలను చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్‌చేశారు. ఎనిమిది నెలలుగా జీతాలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే చెల్లించాలని లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రమేష్, ఓబులేసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జలధికి పీర్లు

పరిగి, జూలై 20(ఆంధ్రజ్యోతి): కొడిగెనహళ్లి గ్రామంలో తొమ్మిదిరోజులుగా కొలువుదీరిన పీర్లకు ఆదివారం జలధి నిర్వహించారు. పుర వీధుల్లో ఊరేగించి చక్కెర, పప్పులు చదివింపులు చేపట్టారు. అనంతరం జలధికి తరలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సతీష్, రఘు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

3600 అడుగుల జాతీయ జెండా ఆవిష్కరణ

పెనుకొండ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): 3600 అడుగుల జాతీయ జెండాను విజయవాడ, ఒంగోలులో ప్రదర్శించనున్నారని మంత్రి సవిత తెలిపారు. ఆదివారం మంత్రి నివాసం వద్ద రొద్దం మండలానికి చెందిన లోకేష్ 3600 అడుగుల జెండాను తయారుచేశారు. దీనిని మంత్రి చేతులమీదుగా జెండా ఊపి సాగనంపారు. సోమవారం అక్కడ ప్రదర్శించనున్నారన్నారు.

పల్లెలతోనే దేశాభివృద్ధి

టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు


గొల్లాపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హిందూపురం మండలం గొల్లాపురంలో జరిగిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధిచేయాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కన్వీనర్ రాము, నాయకులు అరుణాచల్‌రెడ్డి, శ్రీరాములు ఆదినారాయణప్ప, మల్లప్ప, ప్రదీప్, నాగరాజు, నాగన్న, రామక్రిష్టారెడ్డి, అంజినరెడ్డి, హనుమంతు, సూరీ, రకీబ్, రమేష్, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో..



పరిగి (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పుట్టగూర్లపల్లిలో ఆదివారం టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బూత్ ఇన్‌చార్జి వెంకటేష్, క్లస్టర్ ఇన్‌చార్జి రామాంజి, ప్రభాకర్ తదితరులు కరపత్రాలు పంచి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాస్కర్, బూత్ ఇన్‌చార్జి శంకర్, నరసింహమూర్తి, గని, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో..



సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గీతానగర్‌లో ఏడాదిపాలనపై ఆదివారం టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వం అమలుచేసిన పథకాలు వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నీరుగంటి చంద్ర, కన్వీనర్ వెంకటేశులు, మాజీ కన్వీనర్ సిద్దలింగప్ప, వడ్డె సూరీ, సీసీహరి, కిష్టప్ప పాల్గొన్నారు.

కొండాపురంలో..



పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కొండాపురంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని బూత్‌ఇన్‌చార్జి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సాయిరమేష్, వేణుగోపాల్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

అగళిలో..



అగళి, (ఆంధ్రజ్యోతి): మండలంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని జడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అదేవిధంగా సంక్షేమ పథకాలను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మధుడిలో కూడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ మధుడి తిప్పేస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు కుమారస్వామి, మండల క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్, మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

రూ.900 కోసం..

పోలీసులకు ఫిర్యాదు


పోలీసు స్టేషన్‌కు వచ్చిన సరస్వతి

పెనుకొండ టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): అప్పు చిన్నదే అయినా కష్టపడిన డబ్బు ఎలాగైనా వసూలు చేయాలని ఓ మహిళ రెండు వారాల నుంచి స్టేషన్ చుట్టూ తిరుగుతోంది. అయినా ఆమెకు ఆ డబ్బు ఇంతవరకు అందలేదు. విషయానికి వస్తే సరస్వతి అనే మహిళ ఆల్విన్ కాలనీలో నివాసముంటోంది. సమీపంలో ప్రభుత్వ పాఠశాల ఉండటంతో అక్కడ చిల్లరదుకాణం ఏర్పాటుచేసుకుంది. అదే కాలనీలో అద్దెకున్న మణి ఆమె వద్ద రూ.900 అప్పు చేసింది. ఆమె అక్కడి నుంచి వేరే ప్రాంతానికి ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయింది. పలుమార్లు ఆమెకు ఫోన్‌చేసి అప్పు చెల్లించాలని అడిగినా స్పందించకపోవడంతో రెండు వారాల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనవద్ద రూ.900 అప్పుగా సరుకులు తీసుకుందని న్యాయం చేయాలని కోరింది. అయితే ఆమెకు రెండు వారాల నుంచి న్యాయం జరగకపోగా ఆమె ఉన్న నివాసం నుంచి స్టేషన్‌కు వచ్చేందుకు మూడు సార్లు ఆటో ఖర్చు అదనంగా రూ.180 అయిందని బాధితురాలు పేర్కొంది. ఇప్పటికైనా అప్పును చెల్లించేలా చూడాలని పోలీసులను కోరుతోంది.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగితే జైలుకు: సీఐ

హిందూపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా ధూమపానం చేస్తే జరిమానాతోపాటు జైలుకు పంపుతామని టూటౌన్ సీఐ కరీం హెచ్చరించారు. ఆదివారం రహమత్‌పురంలో బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగుతున్న ఇద్దరికి జరిమానా విధించారు. మరోసారి పట్టుబడితే జైలుకు పంపుతామన్నారు. బహిరంగప్రదేశాల్లో ధూమపానం చేయరాదన్నారు.

హోంమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ

మడకశిర టౌన్, జూలై20(ఆంధ్రజ్యోతి): హోంమంత్రి అనిత సోమవారం మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్టబందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వి.రత్న అన్నారు. ఆదివారం హోంమంత్రి పర్యటనపై ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుతో చర్చించారు. అనంతరం మంత్రి పర్యటించే ప్రదేశాలను పరిశీలించారు. హోంమంత్రి పర్యటించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. బహిరంగ సభ జరిగే సమయంలో వచ్చే వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలి..? తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. చిన్న పొరపాటుకు ఆస్కారం లేకుండా బందోబస్తు నిర్వహించాలని సూచించారు.

225 మందితో బందోబస్తు: సీఐ

హోంమంత్రి పర్యటన సందర్భంగా 225 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నట్లు సీఐ నాగేష్‌బాబు తెలిపారు.